సాక్షి
పల్నాడు
బుధవారం, 29, మే, 2024



దేవాదాయ శాఖ అధికారుల సందర్శన

పిట్టలవానిపాలెం: చందోలులోని లింగోద్భవ స్వామి, చెన్నకేశవస్వామి, బగళాముఖి ఆలయాలను రాష్ట్ర దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం సందర్శించారు.



హనుమత్ జయంతి మహోత్సవాలు

నగరంపాలెం: పాతగుంటూరు విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.



నగర సంకీర్తన

సత్తెనపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం పట్టణంలో భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జెడ్పీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్, డెప్యూటీ కలెక్టర్ స్వాతి సందర్శించారు. ఐఏఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్న ఇద్దరు యువ అధికారులు జెడ్పీ పరిపాలన వ్యవస్థ, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి అంశాలను తెలుసుకునేందుకు జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వీరికి జెడ్పీ సీఈఓ జె.మోహనరావు, ఇన్‌చార్జ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు జెడ్పీ పాలనా వ్యవస్థ, బడ్జెట్ రూపకల్పన, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, వివిధ గ్రాంట్ల ద్వారా జెడ్పీకి వచ్చే నిధులు, ఇతర ఆదాయ మార్గాలు తదితర అంశాలను వివరించారు. జెడ్పీ పాలకవర్గం, సర్వసభ్య సమావేశాలను నిర్వహించే తీరుపై వారు చర్చించారు. గ్రామీణాభివృద్ధికి చేపడుతున్న చర్యలు, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ట్రైనీ ఐఏఎస్‌లు ఆసక్తి కనబర్చారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ మంగళవారం తెలిపారు. సంబల్‌పూర్–సికింద్రాబాద్ మధ్య ఈనెల 27, జూన్ 3, 10వ తేదీలలో రైలు నంబర్ 08325ను నడపనున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్–సంబల్‌పూర్ మధ్య ఈనెల 28, జూన్ 4,11వ తేదీలలో రైలు నంబర్ 08326ను తిప్పనున్నట్లు వివరించారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు మంగళవారం 199 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. బుధవారం జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు 27,001 నుంచి 43వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

అభయాంజనేయుడికి విశేష పూజలు

1008 మల్లెలు, బంగారు, వెండి పుష్పాలతో అర్చన

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని రకరకాల పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ నెరుసు భూషణం దంపతులతో ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు హనుమంతుడికి 1008 మల్లెపూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేదికపై సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం వాయుపుత్రునికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.

జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



హాసిని



ఎస్.చరణ్

గుంటూరువెస్ట్ (క్రీడలు): జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లాకు చెందిన ఎస్.చరణ్, హాసిని ఎంపికయ్యారని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగాధరరావు, కడియం జయరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు పంజాబ్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో వీరిద్దరూ పాల్గొంటారన్నారు. ఈనెల 15 నుంచి 17 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరి ఎంపిక జరిగిందన్నారు.

ఖోఖో ఊరు.. పంగులూరు!

- జాతీయస్థాయిలో రాణిస్తున్న పంగులూరు క్రీడాకారులు
- గ్రామంలో కొనసాగుతున్న 252వ శిక్షణ శిబిరం
- దేశంలోనే ఎక్కడాలేని విధంగా పంగులూరులోనే శిక్షణ శిబిరాలు
- ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం
- ఇక్కడ శిక్షణ పొంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు



ఆడుదాం ఆంధ్రాలో ప్రథమ స్థానం సాధించిన పంగులూరు జట్టు (ఫైల్)

జే.పంగులూరు: నీటిపై చేపపిల్లల్లా ఎగురుతూ.. గాలిలో దూది పింజల్లా కదులుతూ, పచ్చికపై కంగారుల్లా పరిగెడుతూ ప్రత్యర్థులను టచ్ చేయాలంటే పంగులూరు క్రీడాకారులకే సాధ్యం. రాకెట్‌లా దుసుకుపోతూ చిరుతల్లా కదులుతూ ఎదుటివారికి దొరకుండా ఆడాలన్నా వారికే సాధ్యం. అందుకే పంగులూరు గడ్డపై పుట్టిన ఎందరో ఖోఖోలో జాతీయ క్రీడాకారులుగా ఎదిగారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పలువురు ఖోఖో క్రీడాభిమానులు ఆట నేర్చుకొనేందుకు పంగులూరు వైపు వస్తున్నారు.

1992లో క్రీడాశిక్షణ ప్రారంభం..

కీర్తిశేషులు మాగుంట సుబ్బరామిరెడ్డి స్థాపించిన మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గ్రామస్తుల సహకారంతో, కళాశాల భవన నిర్మాణ దాత కీర్తిశేషులు బాచిన వెంకట్రావు కుటుంబ సభ్యులు, రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో 1992లోనే ఖోఖో శిక్షణను ఇక్కడ ప్రారంభించారు. అప్పటినుంచి ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్ది వారికి బంగారు భవిష్యత్ అందించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంగులూరులో ఖోఖో శిక్షణకు, క్రీడకు ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా ఇక్కడకు వచ్చి ఖోఖో ఆటల పోటీలను, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

252వ శిక్షణ శిబిరం..

స్పోర్ట్స్ అథారిటీ అనుమతితో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 70 మందికి ఖోఖో క్రీడాకారులకు ఉచిత శిక్షణా శిబిరం పంగులూరు జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో ఏర్పాటైంది. మే ఒకటో తేదీ నుంచి జూన్ ఒకటి వరకు ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఇది 252వ శిబిరంగా నిలవనుంది. ఈ శిబిరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి 70 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరం నిర్వహించాలంటే రూ.1.50 లక్షల పైమాటే.. శిక్షణ శిబిరానికి కుక్కపల్లి వెంకట్రావు (సీఐ), వై శ్రీనివాసరెడ్డి (పీఈటీ), మేక వెంకటేశ్వర్లు (పీఈటీ), తదితర దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారు.



పంగులూరులో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు

ఆడుదాం ఆంధ్రాలో ప్రథమస్థానం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాలో పంగులూరు జట్టు ఖోఖో విభాగంలో ప్రథమ స్థానం లభించింది. ఈ విజయానికిగాను రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు రూ.10 లక్షలు నగదు బహుమతిని అందించింది. ఆడుదాం ఆంధ్రాలో మంచి ప్రతిభ కనబరిచిన కె.రామ్మోహన్ ఉత్తమ క్రీడాకారుడుగా ఎంపిక అవడంతో ఆర్థిక సాయం అందించారు.

జాతీయస్థాయిలో రెపరెపలు..

రాష్ట్రంలో ఖోఖో పేరు వినగానే జే.పంగులూరు వెంటనే గుర్తుకు వస్తుంది. జాతీయస్థాయి క్రీడాకారులకు నెలవైన ఆ గ్రామం జిల్లా ప్రతిష్టను జాతీయస్థాయిలో రెపరెపలాడించింది. ఇంతటి పేరు ప్రతిష్టలు రావటానికి ఆ గ్రామ ప్రజల ప్రోత్సాహం వర్ణించలేనిది. ప్రభుత్వ ఆర్థిక సాయంతోపాటు, గ్రామస్తులు క్రీడాకారులకు ప్రతివిషయంలో ఆర్థికంగా, మానసికంగా మేమున్నాం అంటూ ముందుకొచ్చారు.. భరోసా ఇచ్చారు.

ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు..

పంగులూరు గ్రామంలో ఖోఖో నేర్చుకుని, రాణించి ఎంతో మంది క్రీడాకారులు మంచి ఉద్యోగాలు సాధించారు. మంచి భవిష్యత్‌ను అందిపుచ్చుకోగలిగారు. క్రీడా కోటాలో ఏడుగురు ఎస్ఐలుగా, ఏడుగురు సీఐలుగా పనిచేస్తున్నారు. 25 మంది కానిస్టేబుళ్లుగా సేవలందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 20 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, ఆర్మీలో సుమారు 25 మంది, అమెరికాలో ఐదుగురు, స్పోర్ట్స్ కోటాలో ఇంజినీర్లు, ఎంసీఏలు, ఎంబీఏలు, మెడికల్ చేసినవారు సుమారు 50 మంది ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సచివాలయాల్లో 40 మందికి పైగా ఈ క్రీడా కోటాలోనే ఉద్యోగాలు సాధించారు.

గ్రామస్తుల సహకారం మరువలేనిది..



పంగులూరులో ఖోఖో క్రీడను మొదలుపెట్టి ఇప్పటికి 32 ఏళ్లు అయింది. ఇంతకాలం ఈ క్రీడ శిక్షణ నిర్విరామంగా కొనసాగుతుందంటే అది గ్రామస్తుల తోడ్పాటు వల్లే. ఇప్పటికి 252 శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినప్పటికీ గ్రామస్తుల సహకారం తగ్గలేదు. ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్, బాపట్ల డీఎస్‌డీఓ పాల్ కుమార్ ప్రోత్సాహం మరువలేనిది.

– మేకల సీతారామిరెడ్డి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖోఖో కార్యదర్శి

ఇక్కడ శిక్షణ తీసుకోవడం అదృష్టం..



ఏడేళ్ల నుంచి పంగులూరులో ఖోఖో క్రీడలో శిక్షణ తీసుకుంటున్నాను. ఈ శిక్షణ ద్వారా ఇప్పటికి 20 సార్లు జాతీయ స్థాయి పోటీలు, అల్టిమేట్ ఖోఖో పోటీలు, ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాం. నెల రోజులపాటు పంగులూరు కళాశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతోంది.

– కె.రామ్మోహన్, పంగులూరు

ఉత్తమ శిక్షణ అందిస్తున్నాం..



స్పోర్ట్స్ అథారిటీ అనుమతితో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. వారికి మంచి శిక్షణ అందిస్తున్నాం. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఖోఖో క్రీడలో రాణిస్తున్నారు.

– జొన్నలగడ్డ పాల్, బాపట్ల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్

దేవస్థాన బస్సులు, స్నానఘాట్లలో తనిఖీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన బస్సులు, దుర్గాఘాట్‌లోని స్నానఘాట్లలో ఆలయ ఈవో కె.ఎస్.రామరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడ బస్టాండ్ నుంచి దుర్గగుడికి నడిపే బస్సు మంగళవారం సాయంత్రం దుర్గాఘాట్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో అక్కడికి విచ్చేసిన ఈవో రామరావు బస్సులోకి ఎక్కి యాత్రికుల వద్ద టికెట్లను తనిఖీ చేశారు. బస్సు కండక్టర్ నాగేశ్వరరావును టికెట్లకు సరిపడా డబ్బులు ఉన్నాయా.. అదనంగా ఉన్నాయా అని ఆరా తీశారు. అయితే టికెట్లకు సరిపడా డబ్బులు మాత్రమే ఉన్నట్లు చెప్పడంతో బస్సు ఎక్కిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టికెట్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం దుర్గాఘాట్‌లోకి చేరుకున్న ఈవో అక్కడి దుకాణాలను పరిశీలించారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు నిర్మించిన షెడ్లు తాళాలు వేసి ఉండటంపై ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్తులు మార్చుకునే గదులకు తాళాలు వేస్తే మహిళా భక్తులు దుస్తులు ఎక్కడ మార్చుకుంటారంటూ ప్రశ్నించి వెంటనే తాళాలు తీయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం దుర్గాఘాట్ ఎదుట ఉన్న కేశ ఖండనశాలకు వెళ్లి అక్కడి భక్తులు, నాయీ బ్రాహ్మణులతో మాట్లాడారు. ఈవో వెంట ఈఈ లింగం రమాదేవి, ఏఈ సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2700, గరిష్ట ధర రూ.4400, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.





కౌంటింగ్‌పై సమీక్ష

జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో పర్యటించారు. కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, డీఐజీ సర్వశ్రేష్టత్రిపాఠి, కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్, ఎస్పీ మలిక గార్గ్ పాల్గొన్నారు.

పుత్రశోకం

- రోడ్డు ప్రమాదం మిగిల్చిన విషాదం
- ఎదిగొచ్చిన కొడుకుల్లో ఒకరు దుర్మరణం
- మరొకరు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాటం



మహమ్మద్ హుస్సేన్ బేగ్ (ఫైల్)



చికిత్స పొందుతున్న ఇస్మాయిల్ బేగ్

తెనాలి: చదువుకున్న కొడుకులు ప్రయోజకులయ్యారని సంతోషిస్తున్న ఆ కుటుంబంలో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఉద్యోగం చేస్తున్న కొడుకు విగతజీవుడై తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. మరో కుమారుడు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి గాంధీ నగర్‌లోని లెనిన్ నగర్‌కు చెందిన మహమ్మద్ హుస్సేన్ బేగ్ (19) డిగ్రీ పూర్తిచేసుకుని హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి తమ్ముడు మహమ్మద్ ఇస్మాయిల్‌బేగ్ ఐటీఐలో మోటార్ మెకానికల్ డిప్లమా పూర్తిచేసి, హైదరాబాద్‌లోనే బాలానగర్‌లోని హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)లో అప్రెంటిస్‌గా చేస్తున్నాడు. ఎల్బీ నగర్ సమీపంలోని ఆదిభట్ల ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. తమ్ముడు ఇస్మాయిల్ బేగ్‌ను హెచ్ఏఎల్ వద్ద దిగబెట్టేందుకు సోమవారం ఉదయం ఇద్దరూ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఉదయం 7.15 గంటల ప్రాంతంలో అమీర్‌పేట వద్ద రోడ్డు డివైడర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న హుస్సేన్‌బేగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనక కూర్చున్న తమ్ముడు ఇస్మాయిల్‌బేగ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం అతడు అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడు. వీరి తండ్రి స్థానికంగా ఉన్న ఒక వస్త్ర దుకాణంలో గుమాస్తాగా చేస్తున్నాడు. కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతూ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. హుస్సేన్ భౌతికకాయాన్ని మంగళవారం తెల్లవారుజామున తెనాలి తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం తెనాలి చెంచుపేటలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఆకట్టుకునేలా.. ఆలోచింపజేసేలా..

- మార్టూరులో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి నాటిక పోటీలు
- హృదయాలను హత్తుకునేలా ప్రదర్శనలు



ప్రముఖ రచయిత, నటుడు నంది పురస్కార గ్రహీత నాయుడు గోపి దమయంతి దంపతులను సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

మార్టూరు: నాటక రంగాన్ని ప్రజలే బతికించుకోవాలని ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలకు, వాటి పరిష్కారాలకు అద్దం పట్టే నాటక రంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రేక్షకులపైనే ఉందన్నారు. మార్టూరులో శ్రీకారం స్వచ్ఛంద సంస్థ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 14వ రాష్ట్రస్థాయి నాటక పోటీలు రెండోరోజు ఉత్సాహంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, దర్శకుడు పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ కళ సామాజిక చైతన్యానికి ఉపయోగపడినప్పుడే దానికి ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ నటుడు, రచయిత, నంది పురస్కార గ్రహీత నాయుడు గోపి దమయంతి దంపతులను ముఖ్య అతిథులు సత్కరించారు. రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. మొదటి ప్రదర్శనగా శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారు ప్రదర్శించిన నాటిక 'రైతు భారతం' ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కేవీ మోహనరావు రచించిన నాటికను నాయుడు గోపి దర్శకత్వం వహించారు.

ప్రపంచం బయటపడేలా 'కాపలా'..

మానవ మేధస్సు ఆకాశం అంత ఎత్తు ఎదిగినా అతడి బుద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉంటుందనే ఇతివృత్తంతో రసఝరి పొన్నూరు వారు ప్రదర్శించిన 'కాపలా' నాటిక ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. నేటి ప్రపంచం రకరకాల కాపలాల పహారాలో బంధీగా ఉంటూ బతుకులు వెళ్లదీస్తున్నా.. జరగకూడని నేరాలు ఘోరాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితిలో నుంచి ప్రపంచం బయట పడటం కోసం కాపలాగా మనిషి ఏమి చేయాలి? అని పరిష్కారం చెప్పే ప్రయత్నం చేశారు నటీనటులు. భాస్కరరావు రచించిన కాపలా నాటికకు వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.

కట్టి పడేసిన 'రైతే రాజు'..

సమాజంలో అన్ని వర్గాలకూ పట్టెడన్నం పెట్టే అజాత శత్రువైన రైతన్నకు అందరూ శత్రువులుగా మారడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తూ కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'రైతే రాజు' నాటిక ప్రేక్షకులను కట్టి పడేసింది. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందులు విక్రయ దారులను దాటుకుని ఆరుగాలం కష్టించి పండించిన రైతుకు దళారుల రూపంలోనూ శత్రువులు ఎదురవడం, ప్రకృతి సైతం రైతు పట్ల శత్రువుగా మారడాల మధ్య రైతు చేస్తున్న పోరాటానికి అద్దం పట్టిందీ నాటిక. కంచర్ల సూర్య ప్రకాష్ రచించిన రైతేరాజు నాటికను కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

నాగరికతను చూపిన 'బంధం'

వృద్ధాప్యంలో పసిపిల్లల్లా కలిసి ఉండాల్సిన భార్యభర్తల బంధం ఆకర్షణలకు వెర్రితలలు వేస్తున్న నాగరికతకు లోనైతే వారి జీవితం ఎలాంటి ఒడిదుడుకులకు గురి అవుతుందో తెలియజెప్పే ప్రయత్నం చేసిన నాటిక మైత్రా కళా నిలయం విజయవాడ వారు ప్రదర్శించిన 'బంధం' నాటిక. లోకం హర్షించని రీతిలో భార్యను దూరంగా పెట్టిన భర్త, తన తప్పును ఎలా సరిదిద్దుకున్నాడనే నాటికను హృద్యంగా ప్రదర్శించారు నటీనటులు. మాడుగుల రామకృష్ణ రచించిన బంధం నాటికకు పీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.



కూచిపూడి నృత్యం అదరహో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో అనంతపురం జిల్లా కదిరికి చెందిన సంజయ్ నాట్య కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను రంజింపజేసింది. మంగళవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వీరు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు. చిన్నారులు పలు భక్తి గీతాలకు లయబద్ధంగా నర్తించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. తర్వాత ప్రసాదాలను అందజేశారు.



హోరాహోరీగా ఎడ్ల పందేలు

సామర్లకోట జతకు ప్రథమ బహుమతి


ఎడ్లపందేలు జరుగుతున్న దృశ్యం

బాపట్లటౌన్: మండలంలోని నరసాయపాలెం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్, ఎడ్ల బండ్ల యజమానుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 22 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, నరసాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గట్టుపల్లి ఇజ్రాయేల్‌లు రిఫ్రీలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 20 వేలను తూర్పు గోదావరి జిల్లా, సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్ర కుమార్ ఎడ్ల జత కిలోమీటరు దూరాన్ని 5.13 నిమిషాల వ్యవధిలో చేరుకొని ప్రథమస్థానంలో నిలిచింది. రెండవ బహుమతి రూ.15 వేలు బాపట్ల మండలం, చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన ఎడ్లజత సాధించగా, మూడవ బహుమతి రూ. 10 వేలు స్వర్ణ మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన కటారి వేణుబాబు ఎడ్ల జత, నాల్గవ బహుమతి రూ.5వేలను నెల్లూరు జిల్లా, తూర్పుపాలెం గ్రామానికి చెందిన ఎడ్లజత గెలుచుకున్నాయి. ఈ పోటీల్లో నరసాయపాలెం సర్పంచ్ దాసి హైమవతి, ఎంపీటీసీ సభ్యురాలు దేవరపల్లి జయమణి, కమిటీ సభ్యులు మార్పు నాగేశ్వరరావు, దేవరపల్లి శరత్చంద్ర, దాసి బాబు, చెల్లి చిట్టి, గర్నె పూడి శ్యామ్యూల్, చెల్లి వీరయ్య, అడ్వకేట్ కట్టా కొర్నేలు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

మార్టూరు: ఆస్తి కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్సై మహబూబ్‌బాషా వివరాల మేరకు.. కోలలపూడి గ్రామానికి చెందిన వల్లపు వెంకటేశ్వరరావు (30)కు అదే గ్రామానికి చెందిన సమీప బంధువులతో కొంత కాలంగా ఆస్తి వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బంధువుల మధ్య జరిగిన ఘర్షణతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు సోమవారం ఉదయం పురుగు మందు తాగి తన నివాసంలోనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావుని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వల్లపు వెంకట్రావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బీమా.. పాడి రైతుకు ధీమా

- వైఎస్సార్ పశుబీమా పథకం ద్వారా ప్రభుత్వం అండ
- బీమా మొత్తంలో ప్రభుత్వవాటా 80 శాతం, రైతు వాటా 20 శాతం
- అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ

బాపట్ల టౌన్: వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా ప్రభుత్వం పశుపోషకులకు అండగా నిలుస్తుంది. బీమా మొత్తంలో రైతులు కేవలం 20 శాతం చెల్లిస్తే చాలు.. మిగిలిన 80 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. వైఎస్సార్ పశు బీమా పథకం కింద దేశవాళీ, సంకర జాతికి చెందిన ఆడ, మగ పశువు మృతి చెందితే రూ.30 వేలు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలు, పందులు రూ.6 వేలవరకు ఇవ్వనున్నారు. ప్రభుత్వ నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకోవాలంటే గేదెలు, ఆవులకు 6.4 శాతం, గొర్రెలు, మేకలు, పందులకు 6 శాతం చొప్పున పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. గేదెలు, ఆవుల్లో గరిష్ఠంగా రూ.1.20 లక్షలు, గొర్రెలు, మేకలు, పందుల్లో రూ.15 వేలు వరకు బీమా సదుపాయం ఉంటుంది. ఒకవేళ రైతు పశువును వేరే రైతుకు అమ్మినా ఆ వివరాలు ఏడు రోజుల్లోగా తెలియజేస్తే, పాలసీని కొత్త యజమానికి వర్తింప జేస్తారు. బీమా పరిహారానికి ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలి.

ప్రీమియం చెల్లింపు ఇలా..

దేశీయ, సంకరజాతి ఆవులకు ప్రీమియం మొత్తం రూ.30 వేలకు గానూ ఎస్సీ, ఎస్టీలతో పాటు తెల్లరేషన్ కలిగిన వ్యక్తులు 3 సంవత్సరాలకు గానూ రూ.384, మిగిలిన రైతులు రూ.960 చెల్లించాలి. నాటు జాతి ఆవులు, గేదెలకు ప్రీమియం మొత్తం రూ.15 వేలకు గానూ ఎస్సీ, ఎస్టీలతోపాటు తెల్లరేషన్ కార్డు కలిగిన రైతు లు 3 సంవత్సరాలకు గానూ రూ.192, మిగిలిన రైతులు రూ.480.. గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి ఎస్సీ, ఎస్టీ, రేషన్ కార్డుదారులు రూ.36, ఇతరులు రూ. 90, 2 ఏళ్లకు రూ.54.. ఇతరులు రూ.135, మూడేళ్లకు రూ.75, ఇతరులు 187.5 చొప్పున ప్రీమియం చెల్లించాలి.

రైతు భరోసా కేంద్రాలలో నమోదు..

పశు బీమా సదుపాయం కోసం రైతులు తమ సమీపంలో ఉన్న పశు వైద్యశాలలు, రైతుభరోసా కేంద్రానికి వెళ్లి తమ పశు వుల వివరాలను నమోదు చేసుకొని రైతు వాటా ప్రీమియంను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడాదిలో ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు పశువులకు, గొర్రెలు, మేకలు, పందులు అయితే 50 జీవాలకు మాత్రమే బీమా అర్హత ఉంటుంది. 2 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన గేదెలు, ఆవులకు, అన్ని వయసుల మగ పశువులకు 6 నెలల వయస్సు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు బీమా పథకం వర్తిస్తుంది.

21 రోజుల్లో పరిహారం..

పశువులకు మూడేళ్లపాటు, గొర్రెలు, మేకలు, పందులకు, 1, 2 ఏళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుంది. కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజులలోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి బీమా మొత్తం జమ అవుతుంది. పాడిరైతులకు ప్రభు త్వం కల్పిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకోవాలి. పశువు విలువలను బట్టి ఈ బీమా మొత్తం ఉంటుంది. ఆర్‌బీకేల్లో ఉండే సిబ్బంది, గోపాలమిత్రల ద్వారా పాడిరైతులు అవసరమైన సేవలు పొందాలి.



– ఎం.హనుమంతరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

పోలీస్ అధికారులపై ఫిర్యాదులొస్తే విచారణ

పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ జిల్లా చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి నిరంజన్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి నిరంజన్

మంగళగిరి: పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులొస్తే తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని గుంటూరు పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ జిల్లా చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి నిరంజన్ తెలిపారు. బుధవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కాజ లాస్య రెసిడెన్సీలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల, పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లాల అధికార పరిధిగా ఉన్న ప్రాధికార సంస్థలో చైర్మన్‌తోపాటు ముగ్గురు సభ్యులు ఉంటారనిపేర్కొన్నారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారులపై వచ్చే ఫిర్యాదులను ప్రాధికార సంస్థ ద్వారా విచారణ చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ సభ్యులు విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.రఘు, సీఆర్‌డీఏ డెప్యూటీ డైరెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఐజీకార్‌తో ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ ఎంఓయూ


ఎంఓయూ చేసుకుంటున్న ఐజీకార్, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రతినిధులు

మంగళగిరి: ఇందిరా గాంధీ అణు పరిశోధనా కేంద్రం(ఐజీకార్ కల్పాకం)తో మండలంలోని నీరుకొండ గ్రామంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. బయో మెడికల్ రీసెర్చ్, విపత్తుల రంగాలలోని విద్య, పరిశోధనా ప్రాజెక్టులు, ఇతరత్రా ప్రయోజనకర వర్క్‌షాప్‌ల నిర్వహణ కోసం రెండు సంస్థల మధ్య ఎంఓయూ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కల్పాకం వెళ్లిన యూనివర్శిటి వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ఐజీకార్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రామన్‌ను కలిసి ఎంఓయూకు అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఎంఓయూ పత్రాలపై డాక్టర్ వెంకట్రామన్, డాక్టర్ మనోజ్ కుమార్ అరోరాలు సంతకాలు చేశారు. ఎంఓయూ వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, రీసెర్చ్ ప్రాజెక్టులపై టెక్నాలజీ వినిమయం, క్షేత్రస్థాయి ప్రదర్శనలకు ఉపకరిస్తుందని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు హెడ్ డాక్టర్ కె.ఎ.సునీత, ఐజీకార్ పీహెచ్‌ఆర్‌ఎండీ ఎం.మేనక తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ గురించి ఆందోళన వద్దు

జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: క్యాన్సర్ గురించి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో మంగళవారం డీఎం ఈ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రి వైద్యులకు జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరుగనున్న తరగతులను డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల సత్వరమే వైద్యం అందించే వీలు కలుగుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వైద్యులు రోగులకు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించాలన్నారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ లను ప్రాథమికంగా గుర్తించడానికి వివిధ రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మహిళలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయడం వల్ల గర్భ సంచి ద్వారా వచ్చే వివిధ రకాల క్యాన్సర్‌లను కనుగొనవచ్చని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షను స్క్రీనింగ్‌లో భాగం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీర్ణకోశ సమస్యలు వచ్చినప్పుడు గ్యాస్ ట్రబుల్ ఉందని తాత్కాలిక మందులు వాడకుండా సరైన వైద్యులను సంప్రదించి ఏండోస్కోపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల జీర్ణ కోశ క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్ వ్యాధులను గుర్తించవచ్చన్నారు. 30 ఏళ్ళు దాటినా ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార, అండాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌తోపాటు, మెడలో ఉండే థైరాయిడ్ గ్రంధి స్కానింగ్ చేయించుకోవాలన్నారు. శరీరంలో ఎక్కడైనా గడ్డలు వచ్చినా, మానకుండా ఉండే పుండ్లు, నోటి వెంట రక్త పడుతుండటం, బరువు తగ్గిపోవడం జరిగితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. శరీరంలో ఏ చిన్న గడ్డ వచ్చినా దానిని సూది పరీక్షల ద్వారా క్యాన్సరా కాదా నిర్ధారణ చేసుకోవాలన్నారు.

ఈవీఎం ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనలో నిందితులైన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు మంగళవారం తెలిపారు. తుమ్మకోట గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీకి చెందిన గోరంట్ల చంద్రశేఖర్, కారుమంచి సైదారావులను గురజాల కోర్టులో హాజరు పెట్టినట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 20న పోట్ల సతీష్, జంగాల కోటేశ్వరరావు, మిద్దె పోగు మహేష్, జంగాల సైదులును అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

ఐదు మండలాల్లో 1845 మంది బైండోవర్

అమరావతి: ఎన్నికల లెక్కింపుని పురస్కరించుకుని నియోజవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారనే అనుమానం ఉన్న వారిని, నేరప్రవృత్తి కలిగిన వారిని ముందస్తు జాగ్రత్తగా పోలీసు శాఖ బైండోవర్ కేసులు నమోదు చేసింది. ఐదు మండలాల్లో 1845 మందిని మంగళవారం బైండోవర్ చేశారు. అందులో అమరావతి మండలంలో 373, పెదకూరపాడు మండలంలో 366, క్రోసూరు మండలంలో 480, అచ్చంపేట మండలంలో 356, బెల్లంకొండ మండలంలో 270 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. నియోజవర్గంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. మిగిలిన అన్ని గ్రామాల పైన పోలీసుశాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది.

అలాగే అత్యధిక గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి సోదాలలో మారణాయుధాలు కలిగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నియోజక వర్గంలోని అన్ని పెట్రోలు బంక్‌ల యాజమాన్యాలకు బాటిల్స్‌లో పెట్రోలు నింపవద్దని, అలాగే విడిగా పెట్రోలు పోయవద్దని ఆదేశాలు జారీచేశారు.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

సత్తెనపల్లి: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష, చెక్కు నగదు రూ. 2.50 లక్షలు రెండు నెలల్లో ముద్దాయి ఫిర్యాదుదారునికి చెల్లించాలని, లేనిపక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష విధిస్తూ సత్తెనపల్లి ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని మంగళవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి పట్టణంలోని హరిత ఏజెన్సీ ప్రొపయిటర్ ఈదర శివ శంకరరావు వద్ద బొల్లపల్లి మండలం పార్లపాడు గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ నర్సరీ యజమాని రావూరి నరసింహారావు రూ.6.30 లక్షలు విత్తనాలు అప్పుగా కొనుగోలు చేశాడు. ఆ అప్పును తీర్చమని కోరగా 2018 ఏప్రిల్ 16న పార్ట్ పేమెంట్ క్రింద రూ. 2.50 లక్షలు కెనరా బ్యాంక్ చెక్కును ఇచ్చాడు. ఈ చెక్కును ఈదర శివశంకర రావు తన సత్తెనపల్లి ఎస్‌బీఐ అకౌంట్‌లో కలెక్షన్ నిమిత్తం ప్రజెంట్ చేయగా ఆ చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో ఈదర శివశంకరరావు సత్తెనపల్లిలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేయగా కేసును పూర్తిగా విచారించిన న్యాయమూర్తి ప్రియదర్శిని తీర్పు వెలువరిచారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన

తాడికొండ: నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారిగా నియమితులైన అడిషనల్ ఎస్పీ జయరామరాజు తాడికొండ మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన వివాదాలు, నమోదైన బైండోవర్ కేసులు, గతంలోని ఘటనల గురించి స్థానిక పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈ గ్రామాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల గొడవలు జరిగిన నిడుముక్కల, లాం గ్రామాల్లో ప్రత్యేక భద్రత కొనసాగుతుండటంతో ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. ఏఎస్పీ వెంట తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్‌ఐలు అంజయ్య, రవీంద్ర బాబు పలువురు సిబ్బంది ఉన్నారు.

గొడవలకు పాల్పడితే ఉపేక్షించం

అక్టోపస్ డీఎస్పీ నరసింహారావు హెచ్చరిక

అచ్చంపేట: ఎన్నికల కౌంటింగ్ సమయంలో గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి పరిస్థితిలోను ఉపేక్షించేది లేదని అక్టోపస్ డీఎస్పీ టి.నరశింహారావు హెచ్చరించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో మంగళవారం పోలీసు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అచ్చంపేటలో జూన్ 3,4,5 తేదీలలో లాక్‌డౌన్ అమలులో ఉంటుందన్నారు. అన్ని రకాల వ్యాపార సంస్థలు, బ్యాంకులు మూసివేయాలన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికలలో కొంతమంది గొడవలు సృష్టించారని, వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే ఎలాంటి వారైన శిక్ష తప్పదన్నారు. కొంతమందిపై బైండోవర్ కేసులు పెట్టడం జరిగిందని, మరికొంత మందిని అదుపులోకి తీసుకుంటామని, అవసరమైన వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజు ప్రతి ఒక్కరూ ఇంటికే పరిమితమై టీవీలలో ఎన్నికలు ఫలితాలు తెలుసుకోవాలే తప్ప రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకోవడం, గొడవలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. ప్రస్తుతం మండలంలో 144సెక్షన్ అమలులో ఉన్నప్పటికి ప్రజా జీవనవిధానానికి అటంకం ఉండకూడదన్న కారణంగా వ్యాపార సంస్థలకు అనుమతులిచ్చామన్నారు. జూన్ 3,4,5 తేదీలలో మాత్రం వ్యాపార సంస్థలను పూర్తిగా మూసివేయాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్ బ్రహ్మయ్య, షేక్ కరిముల్లాషావలి, కె.మంగారావు, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు ఎస్‌ఐలు మహమ్మద్‌షఫి, కట్టారాజేష్, వెంకట్రావు, 31 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్


గురజాలలో కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు


గుండ్లపల్లిలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐలు పి.రాంబాబు, షేక్.సమీర్‌బాషా

గురజాల: నగర పంచాయతిలోని జీబీసీ కాలనీలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఏమైనా మారణాయుధాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ద్విచక్ర వాహనాలను సైతం సరైన ధ్రువ పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. పాడుబడిన ఇళ్లను, బావులను, నిర్మానుష్య ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఎవరైనా అనుమానంగా తిరుగుతున్నా తమ దృష్టికి తీసుకురావాలని సీఐ టి.బాలకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బి అనంత కృష్ణ, సుందర్ రాజన్ తదితరులున్నారు.

గుండ్లపల్లిలో 15 ద్విచక్ర వాహనాలు సీజ్

నకరికల్లు: అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.రాంబాబు హెచ్చరించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ఇళ్లలో, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఎన్నికల రోజు ఈవీఎం ధ్వంసం చేయడం, వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ దుండగులు దాడులు చేసిన నేపథ్యంలో గ్రామంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. తనిఖీల సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్రలు, రాడ్లు, గొడ్డళ్లు, సీసాలు లాంటి ఆయుధాలు ఇళ్లలో ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యక్షంగా గొడవలకు దిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా చర్యలు తప్పవన్నారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు తరువాత రెండురోజుల వరకు పికెట్ కొనసాగుతుందన్నారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు సీజ్‌చేశారు. తనిఖీల్లో రాజుపాలెం ఎస్‌ఐ షేక్.సమీర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

1,302 మంది విద్యార్థులు గైర్హాజరు


కంట్రోల్ రూం నుంచి సీఎస్‌లకు సూచనలు చేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. జిల్లా పరిధిలోని 23 పరీక్ష కేంద్రాలలో మంగళవారం గణిత శాస్త్రం పరీక్షకు 3,521 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 2,219 మంది హాజరయ్యారు. మరో 1,302 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు కమాండ్ కంట్రోల్ రూం నుంచి జిల్లాలోని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు తగిన సూచనలు, సలహాలు అందించారు. పరీక్షల నిర్వహణలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 280 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొన్నారు. డీఈఓ వెంకటేశ్వర్లు చిలకలూరిపేటలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.హుస్సేన్ కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటూ సీఎస్‌లకు సూచనలు అందించారు.

ఇంటర్ పరీక్షలు...

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన జూనియర్ ఇంటర్ పరీక్షకు జనరల్ విద్యార్థులు 7,253 మందికి గాను 6,865 మంది హాజరు కాగా మరో 388 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 247 మందికి గాను 237మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సీనియర్ ఇంటర్ పరీక్షకు జనరల్ విద్యార్థులు 1,470 మందికి గాను 1,362 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 106 మందికి గాను 98 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి తెలిపారు.

సజావుగా టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం గుంటూరు జిల్లాలో సజావుగా జరిగాయి. టెన్త్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాల్లో 3,261 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1,604 మంది హాజరయ్యారు.

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్., తెనాలి
GDCC BANK
కేంద్ర కార్యాలయము : తెనాలి
పరిపాలనా కార్యాలయము : గుంటూరు.

మహాజన సభ సమావేశపు నోటీసు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి., తెనాలి నెం. 530 యొక్క మహాజన సభ సమావేశము

తేది : 20-06-2024 గురువారం
సమయము : ఉదయం 11 గం॥లకు
స్థలము : బ్యాంకు పరిపాలనా కార్యాలయము, యన్.టి.ఆర్. సహకార భవన్, 2/13 బ్రాడీపేట, గుంటూరు

నందు జరుగును. కావున బ్యాంకు మహాజన సభ సభ్యులందరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనది.
ఎజెండా అంశములు సభ్యులకు విడిగా పంపించబడును.
మహాజన సభ అనంతరం లంచ్ ఏర్పాటు చేయడమైనది.

ప్రదేశం : గుంటూరు
తేది. 29-05-2024
అన్ని సభ్య సంఘములకు

సం/- శ్రీమతి టి. కృష్ణవేణి
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ M.S.M. Inter (V) College, Guntur 10th Pass అయిన వారికి MLT, MPHW (నర్సింగ్) Agriculture, Veterinary Course లకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. 7386706839, 7386406839

PARAMEDICAL
■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radio graphic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఏదీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225

REAL ESTATE
PLOT FOR SALE
■ గుంటూరు మార్కెట్ నుండి 12 km దూరంలో చింతపల్లిపాడు గ్రామానికి ఆనుకొని ల్యాండ్ కన్వర్షన్ ప్లాట్స్ 111 గజాలు (25x40) 375000/- మాత్రమే. 9492939269

TO-LET COMMERCIAL
■ గుంటూరు హరిహరమహల్ సినిమా హాల్ వెనుక ఇండియన్ బ్యాంక్‌పైన 1st ఫ్లోర్ 3000 Sft కమర్షియల్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. Ph: 9848566343

SERVICES
BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టెకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు. ✆ 9253560455.

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED
■ గుంటూరు గార్డెన్స్ నందు బెడ్ పేషెంట్‌ను చూసుకొనుటకు 35 సం॥లోపు మగ మనిషి కావలెను. టైమింగ్స్: 10:00 am - 7:30 pm. ✆ 7036251234
■ గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు మార్కెటింగ్ చేయుటకు MBA అర్హత గల అభ్యర్థులు కావలెను. Cont: zycxbus@gmail.com ✆ 8978396042
■ గుంటూరులోని మా భూమి రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ సిబ్బంది మరియు లేడీ టెలికాలర్స్ కావలెను. Ph: 9154321444, 8500174527
■ Wanted Motivators for admission of students to paramedical Eligibility: Soft spoken language Contact: 8332004478, 9848134028
■ MNC కంపెనీల్లో కం॥ఆపరేటర్స్, టెలికాలర్స్, సూ॥వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఇన్‌చార్జెస్, ITI ఆల్ ట్రేడ్స్, హెల్పర్స్, Qul: 10th-PG, జీ: 10-25వేలు. ఫోన్ : 7993976590
■ ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ మరియు తెలుగు DTP ఆపరేటర్ కావలెను. జీతం + కమీషన్ అర్హత: 10 ఆపైన 2/2 బ్రాడీపేట, గుంటూరు. 9676123468
■ Wanted Teachers LKG to 10th Class All Subject, Good Salary only guntur Local Cont : Viswa Janani High School, 6/1, indira colony, Sangadigunta, Guntur. 8555893767
■ హైదరాబాద్‌లో Zepto కంపెనీలో Grocery డెలివరి చేయుటకు బాయ్స్ కావలెను. ఫ్రీ భోజనం, ఫ్రీ హాస్టల్. జీతంనెలకు 40000/-సంపాదించుకునే అవకాశం. డిపాజిట్‌మెంట్స్ 9391536380, 9133967972
■ విజయ్ ఈ-ఫైనాన్స్ ఆఫీసు నందు పనిచేయుటకు M.S.ఆఫీసు, DTPలో అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్, తెలుగు & ఇంగ్లీషు వచ్చిన లేడీస్ స్టాఫ్ కావలెను, తెనాలి. ✆ 9032244425 / 9618483836
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217
■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు గుంటూరులోని లక్ష్మీపురం ఏరియాలలో డేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (Male)కావలెను డ్యూటీ: 12 గం, జీతం 13000, Q: 10th Pass/Fail. ✆ 9676107661
■ ఇంటివద్దనే ఉండి పిల్లలను/ పేషెంట్లను చూసుకొనుటకు ట్రైన్డ్ నర్సులు/ఆయాలు హైదరాబాద్, విజయవాడలో పని చేయుటకు కావలెను. ఆకర్షణీయమైన జీతం + వసతి + భోజనం. ✆ 98850 25559, 91608 35559
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఫోన్ 9160900024 / 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఆటోనగర్ బ్రాంచ్, విజయవాడ (4470)
పంటకాలువ రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2544770, 8331015770

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేదీ & సమయం: 21.06.2024, ఉ. 11.00 గం.లకు
రిజర్వు ధర: రూ. 65,30,000/-
ధరావత్తు సొమ్ము: రూ. 6,53,000/-
రిజర్వు ధర: రూ. 96,38,000/-
ధరావత్తు సొమ్ము: రూ. 9,63,800/-
రిజర్వు ధర: రూ. 64,44,000/-
ధరావత్తు సొమ్ము: రూ. 6,44,400/-
www.canarabank.com
https://www.bankeauctions.com
తేది: 28.05.2024, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్